క్లుప్తంగా

25, 26 తేదీల్లో ఫార్వర్డ్ బ్లాక్ సభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ నాయకులు

సీటీఆర్ఐ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర 2వ మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడలో జరుగుతాయని ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి, ఆహ్వాన సంఘం కన్వీనర్ అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత జర్నలిస్ట్, సోషలిస్ట్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య ఆంధ్రాలో ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. 1940 ఏప్రిల్ 6న మద్దూరి అన్నపూర్ణయ్య ఫార్వర్డ్ బ్లాక్ సిద్ధాంతాలను బహిరంగ సభలో వివరిస్తుంటే బ్రిటీషు ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో సుందర రామరాజు, అమ్మవారు, లింగం సత్యవతి పాల్గొన్నారు.

27 నుంచి కేంద్రమంత్రి చౌహాన్ పర్యటన



బొమ్ముల దత్తును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే కేంద్రమంత్రి దేవ్‌సింహ్ చౌహాన్ పర్యటనలో బీజేపీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పిలుపు నిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు ఆధ్వర్యంలో హుకుంపేటలోని గోదావరి రుచులు ఫంక్షన్ హాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బొమ్ముల దత్తు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాలను కేంద్ర మంత్రి పర్యవేక్షిస్తారన్నారు. అనంతరం యోగి వేమన జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, విస్తారక్ నాగలింగం శివాజీ, కురగంటి సతీష్ ,కందుకూరి మనోజ్, కాలెపు సాయిరామ్ పాల్గొన్నారు

పరంపర స్కీమ్‌లో అక్రమాల నిగ్గు తేల్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

సీటీఆర్ఐ: ఏపీ పేపర్‌మిల్లులో పరంపర–2 పేరుతో సాగుతున్న అక్రమాల నిగ్గు తేల్చాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారదర్శకంగా జరగాల్సిన నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకోవడం శోచనీయమన్నారు. రక్తమాంసాలు పీక్కుని తినే రాబందుల మాదిరి కార్మికులను పేపర్ మిల్లు యాజమాన్య ప్రతినిధి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అక్కినేని జయకృష్ణ, కార్మిక సంఘం నేతగా చెప్పుకునే చిట్టూరి ప్రవీణ్ చౌదరి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇప్పటికే కార్మికులకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలు



బహుమతి అందజేస్తున్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – కాకినాడ, రాజమహేంద్రవరం – కోటిపల్లి రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీడిప్ పథకం అమలు చేస్తున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి 15వ తేదీ వరకూ లక్కీడిప్ బాక్స్‌లో వేసిన ప్రయాణికుల టికెట్లను గురువారం డిపోలో ప్రయాణికుల సమక్షంలో డ్రా తీశారు. రాజమహేంద్రవరం – కాకినాడ రూట్‌లో ప్రథమ బహుమతిని దీప, ద్వితీయ బహుమతిని కుమార్ గెలుపొందారు. రాజమహేంద్రవరం – కోటిపల్లి రూట్లో ప్రథమ బహుమతిని బి.సూకరాజు, ద్వితీయ బహుమతి బోడా సత్యనారాయణ గెలుపొందారన్నారు. వీరికి బహుమతులు అందజేసినట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో డిపో అధికారులు అజయ్‌బాబు, రాజబాబు పాల్గొన్నారు.

మరింత వేగంగా సమస్యల పరిష్కారం

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటిని అక్కడికక్కడే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం ఎంతగానో ఉపయోగపడుతోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. స్థానిక 40వ డివిజన్ లక్ష్మీ గణపతి ఆలయం, ఆర్యాపురం మూలగొయ్యి, చింతాలమ్మ ఘాట్ రోడ్లలో గురువారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓకు ఆదేశించారు.

ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీ

ఎంపీ భరత్ రామ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. ఏరోజు ఎక్కడ పర్యటిస్తామనేదీ కొద్ది నిమిషాల ముందుగా మాత్రమే అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. పారిశుధ్య సిబ్బంది కూడా ప్రతి డివిజన్‌లో అప్రమత్తంగా పనులు నిర్వహిస్తున్నారన్నారు. అధికార యంత్రాంగమంతా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ప్రజలు ఏ సమస్యలు చెప్పినా వెంటనే వాటిని అక్కడికక్కడే పరిష్కరించడానికి వీలవుతోందన్నారు. కొన్నిచోట్ల కాలువపైనే ఇళ్లు, మెట్లు నిర్మించడం వల్ల సిల్ట్ తొలగింపు కష్టమవుతోందన్నారు. తద్వారా పూడిక పేరుకుపోయి దుర్వాసన వెలువడుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి దుంగా మీరా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడపగడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్ పాలనలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. స్థానిక 46వ డివిజన్‌లోని సంజీవ నగర్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారులను ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఇళ్ల స్థలాలకోసం పలువురు విజ్ఞప్తి చేయగా, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పరంగా స్థలమిచ్చి ఇల్లు కూడా కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందుతున్నాయన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. జగన్ పాలనపై అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

ప్రకాశం నగర్: సీఎంఎఫ్ఎస్ ఆధార్ లింక్‌పై పింఛనుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పళ్ల సత్యనారాయణ మూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. సీఎంఎఫ్ఎస్ ఆధార్ లింక్ కారణంగా ఎవరికీ పింఛన్లు ఆగవని, దీనిపై ప్రభుత్వ విధి విధానాలు పూర్తిగా ఖరారు కాలేదని చెప్పారు. గురువారం స్థానిక డీటీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛనుదారులు కేవలం మొబైల్ నంబర్‌ను మాత్రమే లింక్ చేసుకోవాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ఆరోగ్య విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో జరిగే ఆరోగ్య కార్యక్రమాలు, వాటి పనితీరును ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేస్తూ, ప్రజలకు అవగాహన కలిగేలా, వారిని చైతన్యవంతులు చేసేలా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు అన్నారు. బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ మెడికల్ అసోసియేషన్ క్యాలెండర్ (2023)ను ఆయన ఆవిష్కరించారు. డీఎల్‌టీవో డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్యపరమైన అంశాలను, ప్రభుత్వ అమలు చేస్తున్న వైద్యవిధానాలను పత్రికలు, మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో పర్యటన



కడియంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై గడపగడపకూ సంతోషం వ్యక్తమవుతోందని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన కడియంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చందన నిర్వహించారు. గ్రామంలోని దళితవాడలో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అవి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉండే సమస్యలను వారినే నేరుగా అడిగారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు చందన దృష్టికి తీసుకువచ్చారు. దివ్యాంగురాలు వరసాల ప్రేమకుమారి ఇబ్బందిని గమనించిన చందన.. వీల్‌చైర్ అందజేస్తానన్నారు. దళారీల్లేకుండా నేరుగా ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు అందుతున్న వైనాన్ని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు వారరాము, బట్టు చిన్ని, సాకా పట్టాభి, గుత్తుల వాసు, దొడ్డా బుజ్జి, ఓగిరాల రాజు, శాకా సురేష్, మణికంఠ, కుసునూరి బాబులు, పూడి బ్రహ్మం, జగదీష్, ఐతరెడ్డి అయ్యప్ప పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న సత్యగోవిందు తదితరులు

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నయన్ ఫెడరేషన్ 2023 నూతన డైరీని జిల్లా ఎనిమల్ హస్బండరీ అధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవిందు కలెక్టరేట్‌లో గురువారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్ డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరి, అధ్యక్షుడు ఎస్‌వీర్రాజు, కేవీ రామరాజు, ఎం. రామారావు తదితరులు పాల్గొన్నారు.

11న జరిగే లోక్ అదాలత్‌పై చర్చ



అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి చర్చా కార్యక్రమాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి గురువారం నిర్వహించారు. స్థానిక బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడారు. వారితో కీలక అంశాలను చర్చించారు. జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి పరిష్కరించదగిన కేసుల వివరాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకి సూచించాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఏపీ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్ 2015 ద్వారా భర్త మరణించడంతో అర్హురాలైన బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర జనరల్ మార్కెట్, పాత సోమాలమ్మ గుడి వీధి, తిలక్ రోడ్డు, రెహమత్ నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, కాటారి నగర్, వీఎల్ పురం జంక్షన్, సత్యనారాయణపురం ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక వంకాయలవారి వీధిలోని సిటీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2003లో చదువుకున్న విద్యార్థులు గురువారం దానవాయిపేటలోని ఉడిపి గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులందరినీ ఆహ్వానించి వారిని సత్కరించారు. ఆనాటి బోధనా పద్ధతులు, తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తుకుతెచ్చుకున్నారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరుఖుల అప్పయ్యశాస్త్రి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, చున్నీలాల్ జాజూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. సీతామహాలక్ష్మి, శ్రీనివాస రామానుజన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఏ.సూరిబాబు పాల్గొన్నారు.

పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణ టీకాలు



టీకాలు వేసే బృందాలకు సూచనలు చేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ సత్యగోవిందు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ, గ్రామాల్లో తిరిగే ఆవులు, ఎద్దులు, ఆంబోతుల్లో ముద్ద చర్మవ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవిందు కోరారు. గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ, జంతు ప్రేమికుల సహకారంతో ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యగోవిందు మాట్లాడుతూ 112 పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశామని, వ్యాధి లక్షణాలున్న 25 పశువులకు వైద్యసేవలు అందించామన్నారు. వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న 11 పశువులను పాత కబేళాలో ఏర్పాటు చేసిన యానిమల్ సిక్ సెంటర్ (క్వారంటైన్)లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ, పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌చంద్ర, పశువైద్యులు, జంతుప్రేమికులు గోపీకాంత్, ఎస్‌పీసీఏ సభ్యులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ కుటుంబానికి నాగేశ్వర్ పరామర్శ



రాధాకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: దుళ్ల గ్రామానికి చెందిన తోకల రాధాకృష్ణ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం పరామర్శించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుమారుడు, మాజీ ఎంపీటీసీ తోకల వీర వెంకట్రావు, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సంతాపం వ్యక్తం చేసారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, మురమండ సొసైటీ చైర్మన్ ఈదర దయాళ్, చేనేత సొసైటీ చైర్మన్ యర్రా సూర్యనారాయణ, పొట్టిలంక మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి చంటిబాబు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వాసంశెట్టి కుటుంబానికి..

కడియం: మాతృవియోగంతో బాధపడుతున్న వేమగిరి మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి నాగబాబు కుటుంబాన్ని గురువారం పలువురు పరామర్శించారు. ఆయన తల్లి వెంకట రమణమ్మ సంస్మరణ సభలో పాల్గొన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు ఆదిరెడ్డి వాసు, వెలుగుబంటి రఘురామ్, మార్ని వాసుదేవరావు, ఆళ్ల ఆనందరావు తదితరులు సంతాప సభలో పాల్గొన్నారు.

రాజేష్ కుటుంబానికి..

ధవళేశ్వరం: బ్లేడ్ బ్యాచ్ సభ్యుడి దాడిలో మృతి చెందిన ధవళేశ్వరం కంచర్లలైన్ ప్రాంతానికి చెందిన అండిబోయిన రాజేష్ కుటుంబాన్ని గురువారం టీడీపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకుడు ఆదిరెడ్డి వాసు, టీడీపీ శెట్టిబలిజ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ,టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వేమన పద్యాలతో సమాజంలో చైతన్యం

- స్మరించుకున్న వక్తలు
- ఘనంగా వేమన జయంత్యుత్సవం
- ఆయన చిత్రపటాలకు నివాళి
- విద్యార్థులకు పోటీలు



ఎస్‌కేవీటీలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణమూర్తి తదితరులు



కడియం హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



సంహిత కళాశాలలో వేమన జయంతి



ఇన్నీసుపేట గ్రంథాలయంలో..

సీటీఆర్ఐ: తన పద్యాల ద్వారా సంస్కరణ వాదానికి బాటలు వేసిన విశ్వకవి యోగి వేమన అని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సత్యనారాయణమూర్తి నాయుడు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖ, కళా గౌతమి సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గురువారం వేమన జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి నాయుడు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి సమస్యపైనా వేమన స్పందించి.. పామరుల నాలుకలపై పద్యాన్ని పరుగులు పెట్టించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు, నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, తెలుగుశాఖ అధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు, కళాశాల సూపరింటెండెంట్ మేడూరు నరసింహ పాల్గొన్నారు.

వేమన పద్యాలపై పోటీలు

కడియం: కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, పెర్సీ, శరత్‌బాబు, గిరజా, లెనినా, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

- కడియం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి ఎంఈవో వి.లజపతిరాయ్ పుష్పాంజలి ఘటించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడున్నర శతాబ్దాల క్రిందటే మూఢ భావాలను పటాపంచలు చేస్తూ, అభ్యుదయ భావజాలంతో పద్యాలు చెప్పిన ప్రజాకవి వేమన అన్నారు. ఆకుల సూర్యనారాయణ, కె.లక్ష్మణ్ కుమార్, కె.జయరాజ్, తోట సత్యనారాయణ, విజయకుమారి పాల్గొన్నారు.
- వేమగిరి కొండపైగల బుద్ధవిహారాలో వేమన జయంతిని నిర్వహించారు. మహోదయ యాజరా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇన్నీసుపేట గ్రంథాలయంలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో యోగి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఎల్ఐసీ విశ్రాంత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అడివి శివరాం పూలమాల వేశారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

సంహిత కళాశాలలో..

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నన్నయ వర్సిటీ ఆచార్యుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ అనాటి కాలంలో రుగ్మతలను వేమన వస్తువుగా చేసుకుని సమాజాన్ని చైతన్యానికి శతక ప్రక్రియను ఆయుధంగా వాడుకున్నారన్నారు. ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ వేమన గొప్ప సంస్కరణ ఉద్యమానికి బాటలు వేసిన మహాకవి అన్నారు. ఎస్‌కేవీటీ తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగు అధ్యాపకురాలు దేవి, ఏవో జి.బాలకృష్ణ, పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖండాంతర ఖ్యాతి

తెలుగుభాషకు యోగి వేమన ఖండాంతర ఖ్యాతిని తెచ్చారని జిల్లా విద్యాశాఖ ఏడీ ఛాయాదేవి అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం కార్యక్రమం జరిగింది. హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీ జయంతి శాస్త్రి, విజయ కుమారి, వరహాగిరి కృష్ణ మోహన్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రూ. 2 లక్షల ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కంబాలచెరువు: స్థానిక జేఎన్ రోడ్డులో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించింది. సోనోవిజన్ సమీపంలోని ఒక ఇంటిలోని పైఅంతస్తులో కొందరు యువకులు అద్దెకుంటున్నారు. వారు పిజ్జాలు, బర్గర్లు తదితర వాటిని తయారు చేస్తూంటారు. ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: తిలక్ రోడ్డు సమీపంలో నివాసముంటున్న బ్రహ్మానందం ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి 60 గ్రాముల బంగారు నగలు, రూ.25 వేలు చోరీరీ చేశారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ నెల 12న బ్రహ్మానందం కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు వెళ్లారు. 18న ఇంటి పనిమనిషి వచ్చి బయటకు శుభ్రం చేస్తుండగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఆమె ఈ విషయాన్ని యజమానికి తెలిపింది. వారు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.